# కాసులిస్తేనే "కరెంట్ "..లేదంటే కొర్రీలు

**-ఆన్లైన్ అప్లికేషన్ చేస్తే సరైన పత్రాలు లేవంటూ రిజెక్ట్**
**-సిబ్బంది ద్వారా వెళ్తే రెండు రోజుల్లో కనెక్షన్**
**-కాంట్రాక్టర్లను సైతం వేధిస్తున్న పలువురు అధికారులు**
**-డబ్బులు ఇవ్వకపోతే నెలలకొద్ది పెండింగ్‌లోనే ఫైళ్లు**
**-ప్రభుత్వం మారినా పనితీరు మారలేందంటూ గగ్గోలు**



**హైదరాబాద్, అక్టోబరు 23,ప్రభాతవార్త:** విద్యుత్‌శాఖలో ఆన్‌లైన్ సర్వీస్ ఆపహస్యం పాలవుతుంది. ఆన్‌లైన్‌లో అప్లై చేసిన వినియోదారులకు నెలలు దాటినా మీటర్ ఇవ్వడం లేదు. పైగా అదిలేదు ఇది లేదంటూ నానాతిప్పలు పెడుతున్నారు. ఒకవేళ వాళ్లు చెప్పినట్లు విని ఎంతోకొంత చెల్లిస్తే రెండుమూడు రోజుల్లో మీటర్ మంజూరు చేస్తున్నారు. ఇలా ఒక్కో మీటర్‌కు 10నుంచి 20వేలు డిమాండ్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో అప్లై చేస్తే కేవలం 1600-2000 వరకు ఖర్చు అయ్యే దానికి అంత చెల్లించలేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. పైగా ఆన్‌లైన్ అప్లై చేసినవారికి రెండురోజుల్లోనే మీటర్ మంజూరు చేసినట్లు ఉన్నతాధికారులకు చూపుతున్నారు. విద్యుత్‌శాఖలో ప్రతినెలా లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా..లంచాలు లేకుండా కొంతమంది అధికారులు ఏపనీ చేయడం లేదు. గ్రేటర్ ప్రతినెల వందల సంఖ్యలో కొత్తవిద్యుత్ కనెక్షన్లు వస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో కొత్తలైన్లు వేయడంతోపాటు వందల సంఖ్యలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి తెస్తున్నారు. కొత్త కనెక్షన్లు మంజూరు మొదలు, అపార్టుమెంట్లకు ప్యానల్ బోర్డు కేటాయించడం ఏపనిచేయాలన్నా వినియోగదారులనుంచి అందినకాడికి దండుకుంటూ కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారు. అపార్ట్‌మెంట్ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే ఒకరేట్, త్రీఫేజ్ కనెక్షన్ తీసుకునేందుకు మరో రేట్ మీటర్ ఛేంజ్ చేసు కోవాలంటే ఇంకోరేట్. ఇలా ఒక్కో పనికి ఒక్కో రేటుతో అక్రమాలకు పాల్పడుతున్నారు.

### కాంట్రాక్టర్లకు తప్పని తిప్పలు ..

టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలో ప్రైవేట్ పనులను టర్న్‌కీ పద్దతిలో కాంట్రాక్టర్లు చేస్తారు. అయితే పనులకు సంబంధించి ముందుగా ఎస్‌పిడిసిఎల్ నుంచి అనుమతి పొందాలి. దీనికి విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ చేస్తారు. పనుల విలువ రూ.8 లక్షల వరకు ఉంటే ఎస్ఈ స్థాయిలో, రూ.12 లక్షల వరకు అయితే జోన్ సిఈ పరిధిలో, అంతకు మించితే కార్పొరేట్ కార్యాలంలో కమర్షియల్‌వింగ్ ద్వారా సిఎండీ నుంచి మంజూరి పొందాలి. ఈఎస్టిమేషన్లలో డిపార్ట్‌మెంట్ ద్వారా ఇచ్చే మెటీరియల్ చార్జ్‌తోపాటు సూపర్‌వైజింగ్ ఛార్జీలు, సర్వీస్ చార్జీలు, జిఎస్‌టి కలిపి తయారుచేసి ఎస్టిమేషన్లఓ పేర్కొన్న విధంగా వినియోగదారులకు డిడిరూపంలో డిస్కమ్‌పేరుతో మూడునెలల కాలపరిమితిలో డబ్బులు చెల్లిస్తారు. ఒకవేళ వినియోగదారుడు వివిధ కారణాలతో సకాలంలో డబ్బులు చెల్లించకపోతే తన ఎస్టిమేషన్ రివైజ్డ్ చేసి ఇస్తే డిడి చెల్లిస్తానని కోరితే ఆఎస్టిమేషన్ రివైజ్డ్ సమయంలో ఉన్న రేట్ల ప్రకారం చేసి ఇవ్వాలి. దీనికి నోటిఫికేషన్ ఇచ్చి ఎస్టిమేషన్ తిరిగి ఏఈ నుంచి మంజూరు చేసే అధికారి వరకు పంపించాలి. ఈవిధానం ప్రస్తుతం టిజిఎస్‌పిడిసిఎల్‌లో కొనసాగుతుంది. అయితే ఇటీవల కాలంలో గ్రేటర్ పరిధిలోని పది సర్కిళ్ల లో పనిచేస్తున్న ఎస్ఈలను సిఎండీ బదిలీ చేశారు. ఈబదిలీల్లో మేడ్చల్ ఎస్ఈగా బాధ్యత లు స్వీకరించిన ఓఅధికారి రివైజ్డ్ ఎస్టిమేషన్ అనే విధానాన్ని ఎత్తివేసి తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకుని రావాలని వేదిస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపించారు.

ఒకవేళ ఏఈనుంచి డిఈవరకు ఫైల్ ఓకేచేసినా ఎస్ఈ తిరిగి పంపి స్తున్నారని ఈవిధానంతో మళ్ళీ అందిరికీ డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ వార్త



# ఆరాంఘర్ -జూపార్కు ఫ్లైఓవర్ కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయండి

**-అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆదేశం**



జిహెచ్‌ఎంసి ,హెచ్‌ఎండీఏ కమిషనర్లకు ఫ్లైఓవర్ గుర్చి వివరిస్తున్న సిఈ దేవానంద్ తదితరులు

**హైదరాబాద్,అక్టోబరు 23,ప్రభాతవార్త:** అరాంఘర్-జూపార్క్ ఫ్లైవోర్ పనుల కోసం భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మాణంలో ఉన్న శిల్పా లేఅవుట్ ఫేస్2 ఫ్లైఓవర్ పనులు, ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు చేపట్టిన ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. శాస్త్రీపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరారు. శిల్పాలే అవుట్ ఫేజ్2 ఫ్లైఓవర్ పనులు 22కేవీ విద్యుత్ లైన్ల కారణంగా పనుల్లో జాప్యం జరుగుతుందని ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ,వెంటనే విద్యుత్ లైన్ తొలగించాలని కమిషనర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. 33.కె.వి విద్యుత్ లైన్ తొలగించకపోవడంతో శిల్పాలేఅవుట్ ఫేస్ 2 పనులను స్ట్రామ్ వాటర్ డ్రైన్, కల్వర్టు, ర్యాంపు (ఆర్.ఈ)పనులు చేపట్టలేకపోయామని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించడంతో వెంటనే తొలగించాలని టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. అలాగేఅసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ పనులు యుద్ద ప్రాతిపధికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్‌తోపాటు ప్రాజెక్ట్ సి.ఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, డిప్యూటీ ఈఈ హరీష్, విద్యుత్,రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం

**-అడ్డుకున్న బాధితులు... జెసిబి గ్లాస్ ధ్వంసం**
**-ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు**
**-తహసీల్దార్ రాములు హెచ్చరిక**





బాధితులు జెసిబి గ్లాస్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

**అత్తాపూరు అక్టోబరు 23,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్‌లోని టిఎన్జీవోస్ కాలనీలో సర్వే నెంబరు 156/1లోని ప్రభుత్వం భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై భారీ పోలీసుబందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వం స్థలాన్ని కొందరు కబ్జాదారులు అక్రమించుకొని నకిలీ పత్రాలు సృష్టించి ఇతరులకు ఆ భూమిని విక్రయించి లక్షలు దండుకున్నారు.ఎలాంటి పత్రాలు,అనుమతులు చూపించకపోవడంతో బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.దీంతో జెసిబిని బాధితులు అడుకోవడంతో అక్కడ కొద్దిసెపు రెవెన్యూ సిబ్బంది, బాధితుల మధ్య పరిస్థితి ఉద్రిక్తగా మారింది.ఈ క్రమంలో బాధితులు జెసిబి గ్లాస్‌ని కూడా పగలగొట్టారు.పోలీసులు రంగ ప్రవేశం చేసుకొని బాధితులను అదుపులోకి తీసుకొని కూల్చివేత్తలను కొనసాగించారు.

### బాధితుల ఆవేదన

తమ లక్షల రూపాయలు పెట్టి ఆ స్థలాన్ని కొన్నామని ఇప్పుడు రెవెన్యూ అధికారులు కూల్చిడం సరైందని కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.తమకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### పభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు : తహసీల్దార్ రాములు

ప్రభుత్వం భూమి లోపల సుమారు 1000 గజాలను స్వాధీనం చేసుకొని కంపౌడ్ వాల్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు.దీంతో బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి రెవెన్యూ సిబ్బంది కబ్జా గురైన స్థలాల్లో కూల్చివేతలు జరిపారని ప్రభుత్వం భూములో నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ పరంగా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కూల్చివేత్తలను ఎవరైన అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపైన కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రాజేంద్రనగర్‌లో ఎక్కడైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే తమ దృష్టి తీసుకురావాలని తెలిపారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి యత్నం

**-ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా**
**మూసీ పరివాహక ప్రజలకు అన్యాయం జరిగితే ప్రభుత్వాన్ని మూసీనదిలో ముంచుతాం**
**-రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి కాశం వెంకటేశ్వర్లు**



పాతబస్తీ బహదూర్‌పుర మూసీ నది పరివాహక ప్రాంతాలలో పర్యటిస్తున్న నిజామాబాద్ రూరల్ బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా,బహదూర్‌పుర నియోజకవర్గం బిజెపి కంటెస్ట్‌డ్ ఎమ్మెల్యే నరేష్

**చార్మినార్,అక్టోబరు 23 ప్రభాతవార్త :** మూసీ ప్రక్షాళన పేరుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నదని,మూసీ పరివాహక పేద ప్రజలకు బిజెపి అన్ని విధాల అండగా ఉంటుందని నిజాబామాద్ రూరల్ బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని మూసీ పరివాహక ప్రాంతాలను బహదూర్‌పుర నియోజకవర్గం బిజెపి కంటెస్ట్‌డ్ బిజెపి ఎమ్మెల్యే నరేష్‌తో పాటు పలువురు బిజెపి నాయకులతో కలిసి పర్యటించారు.మూసీ పరివాహక ప్రజలకు ఆయన ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతాలలో ఎన్నో ఏళ్ల నుంచి పేద ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారిని బయటకు పంపించే ప్రయత్నం చేయటం ఎంత వరకు సమంజసమని ఆయన తీవ్రంగా విమర్శించారు.మూసీ పరివాహక ప్రాంతంలో గోడనిర్మించుకుంటే సరిపోతుందని ఎప్పుడు బుల్డోజర్లు వస్తాయోనని ప్రజలు భయంతో బతుకుతున్నారని ఆయన తెలిపారు.కాళేశ్వరం కట్టి బిఆర్ఎస్ దోచుకుందని,అదే విధంగా మూసీ ప్రక్షాళన కోసం లక్షా యాభై వేల కోట్లు రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తామంటున్నదని ఆయన తెలియజేశారు.రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి కాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బిజెపి ఎప్పుడు ప్రజల పక్షాన నిలుస్తుందని, మూసీ పరివాహక ప్రజలకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మూసీనదిలో ముంచుతామని తెలిపారు.మూసీ పరివాహక ప్రజల ఇండ్లను కూలగొడితే బిజెపి నాయకులు,కార్యకర్తలు అడ్డుకుంటారని ఆయన తెలియజేశారు.ఈ నెల25వ తేదీన ఇందిరా పార్కు వద్ద చేయనున్న ధర్నా కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.బిజెపి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా,బిజెపి ప్రధాన కార్యదర్శి కాశం వెంకటేశ్వర్లు,పాతబస్తీకి చెందిన బిజెపి నాయకులు కలిసి కిషన్‌బాగ్‌లోని మూసి పరివాహక ప్రాంతాన్ని సందర్శించారు.మూసి పరివాహక ప్రజలను కలిశారు.కాశీబగ్గ మందిరంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా శ్రీ పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం తరుపున ఎమ్మెల్యేసూర్యానారాయణ గుప్తాను శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన సీనియర్ బిజెపి నాయకులు టి.ఉమామహేంద్ర,వెంకటా చలం, సంతోష్,సురేందర్,పొన్నా వెంకట రమణ, బహదూర్‌పుర నియోజకవర్గం బిజెపి కంటెస్ట్‌డ్ ఎమ్మెల్యే నరేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా బహదూర్‌పుర ఇన్‌స్పెక్టర్ రఘునాథన్, కాలాఫత్తర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

# పేరిణినాట్య చరిత్రలో తొట్టతొలి నృత్యరూపకం ప్రేరణ



నాట్యచరిత్రలో మొట్టమొదటి పేరిణినాట్య నృత్యరూపకం ప్రేరణలో దృశ్యాలు

**రవీంద్రభారతి, అక్టోబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి పేరిణి నాట్య ప్రస్థానంలోనే మైలురాయివంటి సన్నివేశం, ఆ చరిత్రలోనే అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుట్టిన తొట్టితొలి నృత్యరూపకం ప్రేరణ అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. భారతదేశమంటేనే వివిధ కళలు, నాట్యాలు, సంస్కృతుల సంగమ స్థలమని, ప్రాంత, భాష, మతాలు, సంప్రదాయపరంగా ఆచారాలు, రీతులు, రివాజులు, కట్టుబాట్లతో ఎంతో వైవిధ్యమైన నేల అన్నారు. తెలంగాణ ఉత్తర దక్షిణ భారతదేశానికి మధ్య సంధానవారధిగా గిరిజన, జానపద, శాస్త్రీయ సంగీత నృత్యకళారూపాలు ఎంతో అద్భుతంగా ఫరిడవిల్లిన చరిత్ర ప్రస్ఫుటంగా ఉందన్నారు. అందులో గొప్పగా చెప్పుకోదగ్గ కళారూపం పేరిణి నాట్యరూపమన్నారు. వివిధ పాత్రలతో అద్భుతమైన సన్నివేశాలతో సుమధుర సంగీత, కాకతీయుల కాలంనాటి కళాస్ఫూర్తితో ప్రారంభమై నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కార దిక్సూచిగా ఈ ప్రదర్శన కొనసాగింది. డా. పురుషోత్తమాచార్య అద్భుత సాహిత్యం, పేరిణినాట్య కళాకారులు నవ్యజ, రంజిత్‌కుమార్ కంపోజిషన్, రాయభారపు శ్రవణరాజ్, గుమ్మడిరాజు శ్రీవాణిల సంగీతంలో రూపొందిన ఈ నృత్య రూపకం 2.30గంటల నిడివితో వరంగల్‌కు చెందిన 40మంది అత్యుత్తమ కళాకారులతో నేత్రపర్వంగా ప్రదర్శింపబడి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో నాట్యగురువులు, ప్రముఖులు పాల్గొని కళాకారులను, నిర్వాహకులు గజ్జెల నవ్యజ, రంజిత్‌కుమార్‌లను, ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను ఎంతగానో అభినందించారు.

# 800 మిస్సింగ్ సెల్‌ఫోన్లు స్వాధీనం

## -యజమానులకు అప్పగింత



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతో వివిధ విభాగాల పోలీసులు

**గచ్చిబౌలి, అక్టోబరు 23 ప్రభాతవార్త :** చోరీకి గురైన, యజమానులు పోగొట్టుకున్న 800 సెల్‌ఫోన్లను సైబరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకొని యజమానులకు అప్పగించారు. కేవలం 35 రోజుల వ్యవధిలో 2.40 కోట్ల రూపాయల విలువైన సెల్‌ఫోన్లను పోలీసులు కనిపెట్టారు. ఈమేరకు బుధవారం సైబరాబాద్ కమీషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిసిపి కె.నరసింహా చేతుల మీదుగా యజమానులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిసిపి నరసింహా మాట్లాడుతూ ప్రజలు వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న దాదాపు 2.40 కోట్ల రూపాయల విలువైన 800 సెల్‌ఫోన్లను గత 35 రోజుల వ్యవధిలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సైబరాబాద్ సిసిఎస్, ఐటి సెల్, సోషల్ మీడియా టీమ్స్‌ల భాగస్వామ్యంతో సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ద్వారా వాటి యజమానులకు గుర్తించి సెల్‌ఫోన్లను అప్పగించామని అన్నారు. ఇందులో కమీషనరేట్ పరిధిలోని మాదాపూర్ సిసిఎస్ టీమ్ 135, బాలానగర్ సిసిఎస్ 140, మేడ్చల్ సిసిఎస్ 101, రాజేంద్రనగర్ సిసిఎస్ 133, శంషాబాద్ సిసిఎస్ 72, మేడ్చల్ జోన్ 105, ఐటి సెల్ 101 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను కొనుగోలు చేయడం చట్టరిత్యా నేరమని డిసిపి నరసింహా తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని, అజాగ్రత్త పనికి రాదన్నారు. సైబర్ క్రైమ్స్ పెరిగిపోతున్న తరుణంలో ఫోన్లను చోరీ చేసిన నిందితులు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఉపయోగించే అవకాశం ఉందని, పలు సందర్భాల్లో బ్లాక్ మెయిల్ చేసేందుకు చోరీ సెల్‌ఫోన్లను నిందితులు ఉపయోగిస్తున్నారన్నారు. సెల్‌ఫోన్లు మన జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, వాటిల్లో ఎంతో విలువైన వ్యక్తిగత సమాచారం ఉంటుందన్నారు. వాటిని నేరస్థుల చేతితో పడకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. సెల్‌ఫోన్లు పోయినప్పుడు యజమానులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా సిఈఐఆర్ పోర్టల్‌లో పిర్యాదు చేయాలని సూచించారు. దీని ద్వారా నేరస్థులు సెల్‌ఫోన్లను ఇతర చట్టవ్యతిరేఖ పనులకు వాడకుండా వెంటనే వాటిని గుర్తించడం, అడ్డుకోవచ్చని తెలిపారు. ఒకేసారి భారీస్థాయిలో సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని యజమానులకు అప్పగించిన సైబరాబాద్ వివిధ విభాగాల పోలీసులను ఆయన అభినందించారు.

# సౌత్ కొరియా సియోల్ పర్యటనలో మంత్రులు, మేయర్, డిప్యూటీ మేయర్



పరిస్థితిని తెలుసుకుంటున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

**తార్నాక, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మూసికి పునర్జీవం పోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగుల వేసే క్రమంలో భాగంగా వివిద కార్యక్రమాలను చేపడుతుంది. అందులో భాగంగా సౌత్‌కోరియాకు మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నగర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, మున్సిల్ సెక్రటరీ దాన కిషోర్ బృందం సౌత్‌కోరియాకు వెళ్లిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా వారు సియోల్ నగరంలో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. నదుల పునరుద్ధరణ, నిర్వాహణ విధివిధానాలపై సుదీర్ఘ అద్యయనం చేస్తున్నారు.

## క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న మహిళ

### - అనాథగా మారిన నాలుగేళ్ల బాలుడు

**నార్సింగి, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** క్షణికావేశానికి గురైన ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన వెంకటేష్, లక్ష్మీ(27)లకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. వెంకటేష్ ప్రైవేటు ఉద్యోగి. లక్ష్మీ గృహిణి. భార్యా,భర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవకు మనస్థాపం చెందిన లక్ష్మీ బుధవారం ఉదయం భర్త ఉద్యోగానికి వెళ్లగానే తన కుమారుడిని పక్కింట్లో దించి, తన ఇంట్లోకి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొంత సమయానికి పక్కింటి వారు వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించింది. ఈ విషయంనను వారు వెంకటేష్ కు తెలిపారు. వెంకటేష్ నార్సింగి పోలీసులకు వివరించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తల్లి తీసుకున్న క్షణికావేశ నిర్ణయానికి నాలుగేళ్ల బాలుడు అనాథగా మారాడు.

# దేశవ్యాప్తంగా కులగణన చేయాలని "26న ఛలో ఢిల్లీ "

**-బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**



ఛలోఢిల్లీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, నందగోపాల్, ఉదయ్‌నేత తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 23,ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో బిసిబిల్లుపెట్టాలని, జనగణనలో కులగణన చేయాలి, బిసి ఉద్యగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర బడ్జెట్‌లో బిసిలకు 2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు బుధవారం కాచిగూడలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నందగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిధిగా హాజరై ఛలోఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఈఛలో ఢిల్లీ కార్యక్రమానికి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిమంది బిసి కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొంటారని తెలిపారు. ప్రతి బిసి ఈఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలని 30ఏళ్లుగా ధర్నాలు చేయడంతోపాటు ప్రధానులను సైతం కలిశామని వందలాదిమంది ప్రతిపక్ష పార్టీల నేతలు కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు మారిగా బిసిడిమాండ్లను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. భారత దేశం ప్రజజాస్వామ్య దేశం అని అన్నికులాలు, సామాజిక వర్గాలకు వారివారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలన్నారు. అప్పుడే దేశంలో సమైక్యత, సమగ్రత శాంతి ఉంటుందని తెలిపారు. బిసివర్గానికి చెందిన వ్యక్తి ప్రధానమంత్రి అయ్యిఉండి కూడా బిసిబిల్లుపెట్టకపోతే చరిత్రలో ఇంకా ఎవరూ చేయలేరన్నారు. కావున ఢిల్లీలో జరిగే ఈధర్నాకు బిసిలందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నీలం వెంకటేష్, ఉదయ్‌నేత, రాఘవ, రఘుపతి, మోదీ రాందేవ్, రవియాదవ్, నిఖిల్, దేవేందర్, బాలయ్య పాల్గొన్నారు.

## సనాతన హింధూ ధర్మ పరిరక్షణ కన్వీనర్‌గా గోవర్ధనం ప్రవీణ్ కుమార్ ఆచార్యులు..

**పేట్ బషీరాబద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

రామానుజాయుజ్ఞత పీఠం దక్షిణ భారతదేశ అధ్యక్షులైన ఆగమశాస్త్ర విశారధులైన గవర్నర్ అవార్డు గ్రహిత శ్రీమాన్ గోవర్ధనం ప్రవీణ్ కుమార్ ఆచార్యులను సుచిత్ర సర్కిల్ ప్రాంతానికి సనాతన హింధూ ధర్మ పరిరక్షణ కన్వీనర్‌గా నియమించడం జరిగిందని సనాతన హింధూ ధర్మ పరిరక్షణ రాష్ట్ర కార్యదర్శి తిరుమల మనోహరాచార్య తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుమల మనోహరాచార్య మాట్లాడుతూ సనాతన హింధూ ధర్మాన్ని ప్రతి ఒక్క హిందూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

## విద్యా కమిషన్ మెంబర్‌గా జోత్స్న శివారెడ్డి బాధ్యతలు



విద్యా కమీషన్ మెంబర్‌గా జోత్స్న శివారెడ్డి

**పేట్ బషీరాబద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ మెంబర్‌గా జోత్స్న శివారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో కొంపల్లి కౌన్సిలర్‌గాను, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రధాన కార్యదర్శిగాను, రేవంత్‌రెడ్డి అనుచరురాలిగా ముద్రవేసుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ మెంబర్ జోత్స్న శివారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాను చేసిన సేవలకు గాను, గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర అధినాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, విధేయతగా నియమనిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా తన వృత్తి నిర్వహిస్తానని అన్నారు. ఇందుకుగాను సోమవారం కొంపల్లి మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామ చేసి బుధవారం తెలంగాణ రాష్ట్ర విద్యా కమీషన్ మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించండి : బిజెపి



ఏసీపీ జోత్స్నకు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి శ్రేణులు

**నిజాంపేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

నిజాంపేట్ భాజాపా అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ జోత్స్నను, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సత్యనారాయణలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ పాలకమండలి ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని ప్రస్తుత కమీషనర్ దీర్ఘకాల సెలవుపైన వెళ్ళడం వంటి కారణాలతో కార్పొరేషన్ పరిధిలో అనేక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ముఖ్యంగా కార్పొరేషర్ పరిధిలోని వివిధ కాలనీలలో రోడ్డు, డ్రైనేజీ మరమ్మత్తు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిజాంపేట్ మున్సిపల్ ఆఫీస్ నుండి మెయిన్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి కమర్షియల్ షాపులు వెలుస్తున్నాయని, పార్కింగ్ సదుపాయం లేకపోవడం ద్వారా వాహనదారులు రోడ్డుపైనే పార్కు చేయడం ద్వారా ట్రాఫిక్ జామ్‌తో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు ఆక్రమణలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా, దాసి నాగరాజు, సంతోష్, సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గార్బేజ్ లిఫ్టింగ్ రిక్షాలు పంపిణీ



రిక్షాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** అంబర్‌పేట్ నియోజక వర్గంలో కార్పోరటర్లు పద్మ వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్ గౌడ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం గార్బెజ్ లిఫ్టింగ్ రిక్షాలను పంపిణీ చేశారు. నగరంలో చెత్తను తరలించేందుకు లిఫ్టింగ్ రిక్షాలు ఎంతో దోహదపడుతాయని ఎమ్మెల్యే కాలేరు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ మారుతి దివాకర్, ఎఎంహెచ్ఓ డా. హేమలత పాల్గొన్నారు.

## కబడ్డి, టైక్వాండోలో అంబేద్కర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో జరిగిన టైక్వాండో టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. అండర్ 80కేజీ విభాగంలో ఎస్.సతీష్‌కుమార్ బంగారుపతకాన్ని సాధించగా, 54కేజీల విభాగంలో బి.గౌరీ వెండిపతకాన్ని, 80 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్‌ను, 58కేజీల విభాగంలో ఎ.పురుషోత్తమ్ కాంస్యపతకాన్ని సాధించారు. అదే విధంగా 63కేజీల విభాగంలో ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ద్వితీయ స్థానాన్ని సాధించారు. అదే విధంగా ఓయు అంతర్ కళాశాలల పురుషుల కబడ్డి ఛాంపియన్‌షిప్ పోటీలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల విద్యార్థులు సెమీఫైనల్‌లో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి తృతీయస్థానాన్ని సాధించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని కళాశాలలో ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజా వివేక్ విద్యార్థులను అభినందించారు. మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పథకం అరోగ్య సంజీవని

**చిక్కడపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త:** సిఎంఆర్ఎఫ్ పథకం ఆరోగ్య సంజీవని అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. రామ్‌నగర్ డివిజన్‌కు చెందిన సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.3.98లక్షల విలువైన చెక్కులను పదకొండు మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రామ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, బిఆర్ఎస్ ముషీరాబాద్ మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, నేతలు ముదిగొండ మురళీ, వెల్లంకి ఇంద్రసేనారెడ్డి, గోకా నవీన్, జ్ఞానేశ్వర్‌గౌడ్, గుండు వెంకటేశ్, మహిళా అధ్యక్షురాలు నీలాదేవి, తులసీ, మంజుల, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించలేని అసమర్థ ప్రభుత్వం గద్దెదిగాలి : ఆర్. కృష్ణయ్య

**- మూడు నెలలుగా ఉద్యమిస్తున్నా స్పందించరా..**
**- వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ.**

**మెహిదీపట్నం, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించలేని అసమర్థ ప్రభుత్వం వెంటనే గద్దెదిగాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు అర్. కృష్ణయ్య హెచ్చరించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు విద్యనభ్యసించడం ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే రూ.4 వేల కోట్లున్న ఫీజు బకాయిలను చెల్లించడం లేదని అరోపించారు. మూసీ సుందరీకరణకు లక్షా 50 వేల కోట్లు ఎక్కడి నుంచి తీసుకోస్తారని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మెహిదీపట్నం రేతిభౌళి చౌరస్తా వద్ద వేలాది మంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత మూడు మాసాలుగా విద్యార్థులు ఆందోళన, ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంతవకు విద్యార్థులకు ఫీజు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదన్నారు. పది నెలల కాలంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం, తీసుకొచ్చిన అప్పులు, కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లులు, ఇతర అవసరాల కోసం ఎన్ని చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించక పోవడంతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులను చదవలేక పోవడంతో పాటు ఉద్యోగాలను కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థకు మొదటి ప్రాదాన్యత ఇచ్చి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెలించాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని ఉదృతం చేయాల్సి వస్తుందన్నారు. ఈ ర్యాలీలో నీల వెంకటేష్, ఎమ్.పృధ్వీగౌడ్, రవికుమార్ యాదవ్, దొడ్డిపల్లి రఘుపతి, నిఖిల్, చిక్కుడు బాలయ్య ముదిరాజ్, బలరామ్ వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మూసీ బాధితులకు బిజెపి అండ : తోకల శ్రీనివాస్‌రెడ్డి

**- విఘ్నేశ్వర కాలనీలోని బాధితులతో సమావేశమైన బిజెపి నేతలు**

**నార్సింగి, అక్టోబర్ 23 ప్రభాతవార్త :**

మూసీ బాధితులందరికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, అన్యాయం జరుగకుండా అడ్డుకుంటుంది బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బండ్లగూడ కార్పోరేషన్‌లోని మూసీ బాధితులను బిజెపి నాయకులు కలిసి వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఓట్లతో ఎంపికైన ప్రభుత్వం, పాలకులు ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడాలని, ఇలా ప్రజా వ్యతిరేక విధానాలకు తెరలేపడం దారుణమని మండిపడ్డారు. రెండు,మూడు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వ అధికారుల నుంచి అనుమతులు తీసుకొని, బ్యాంకుల నుంచి లోన్లు తీసుకొని నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు మూసీ బఫర్‌జోన్ అంటూ, వాటిని కూల్చివేస్తామని హడావుడీ చేయడం, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం వెయ్యి మంది వరకు మూసీ బాధితులున్నారని ఒక్కరికి కూడా అన్యాయం జరుగకుండా బిజెపి తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతం నుంచి మీ ఓట్లతో ప్రజా ప్రతినిధులుగా చెలామణి అవుతున్న కార్పోరేటర్, ఎమ్మెల్యే మీకు అండగా ఉండి, సీఎంను కలిసి న్యాయం జరిగేలా చూడాల్సింది పోయి ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ కూడబెట్టుకున్న డబ్బులతో ఇళ్లు నిర్మించుకుంటే... వాటిని కూల్చివేస్తామని సర్కారు పెద్దలు హెచ్చరికలు పంపడం అన్యాయమన్నారు.



బండ్లగూడ కార్పోరేషన్ ఒకటో డివిజన్ విఘ్నేశ్వర కాలనీలో మూసీబాధితులతో మాట్లాడుతున్న బిజెపి నాయకుల దృశ్యం

పేదలందరి శవాలపై మూసీనదిని సుందరీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. బడాబాబుల వ్యాపారాల కోసం గరీబుల ఇళ్లు కూల్చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. మూసీ బాధితుల కోసం ఈనెల 25.వ,తేదీన బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, నాయకులమంతా ఒక్కరోజు దీక్ష చేస్తామని, దానిలో మీరంతా భాగస్వాములు కావాలని తోకల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు నర్సిహ్మారెడ్డి, భీమార్జున్‌రెడ్డి, మహేష్ యాదవ్, విజయ్ కుమార్, నరేష్, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిడిఎంఎ కార్యాలయం వద్ద ధర్నాకు అనుమతి ఇవ్వాలని కార్మికుల వినతి

**నార్సింగి, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25.వ,తేదీన సిడిఎంఏ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాకు అనుమతి ఇవ్వాలని కార్మికులు బుధవారం బండ్లగూడ కార్పోరేషన్ కమీషనర్ శరత్ కుమార్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా గండిపేట మండల కమిటీ కన్వీనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో 65.వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో కార్మికులు పని చేస్తున్నారని, వీరందరిని పర్మినెంట్ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని చేస్తున్న సమయాల్లో ప్రమాదం జరిగి మరణిస్తే సర్కారు నుంచి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం కింద రూ.26.వేలు చెల్లించాలని, 8.గంటలు మాత్రమే పని చేయించుకోవాలని, ప్రమాదాల్లో మరణించే కార్మికులకు రూ.25.లక్షల ఇన్సూరెన్స్ పతకాన్ని అమలు చేయాలని, దహన ఖర్చుల కింద రూ.30.వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే కార్మికులు ఇచ్చే రేయిన్ కోర్టులు, స్వెటర్లు, సబ్బులు, నూనెలు ఇతర సామాగ్రిని పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని, రాత్రి వేళల్లో పని



ధర్నాకు అనుమతినివ్వాలని బండ్లగూడ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

చేసే కార్మికులు బస్సు కిరాయిలు ఇవ్వాలని, రెస్ట్ రూంలు ఏర్పాటు చేయాలని, పిఎఫ్,ఇఎస్ఐ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు యాదగిరి, సుభాష్, సురేష్, నవీన్, శ్రీధర్, జనార్ధన్‌రెడ్డి, మహిపాల్ యాదవ్, హైమద్, వంశి, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణుల మాండలిక పదజాలం లక్ష్మీనరసింహారావు రచనలు



కె.ఎల్.రావు చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న హెచ్.జె.దొర, పద్మావతి, రామచందర్, సాధుశ్యాం తదితర అతిథులు

**-సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ డిజిపి హెచ్.జె.దొర**

**నాంపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు (కె.ఎల్.రావు) రచనలు గ్రామస్థులు మాట్లాడే మాటతీరు, పదజాలంతో కూచిన మాండలికంలో, అందరికీ సులువుగా అర్థమయ్యేరీతిలో ఉంటాయని, పాత్రల రూపకల్పన కూడా అందుకు తగ్గట్టుగా ఉంటాయని సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్.జె.దొర అన్నారు. కె.ఎల్.రావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా నాటకోత్సవాలు నిర్వహించడం హర్షదాయకమని నిర్వాహకులను అభినందించారు. కె.ఎల్.రావుతో సాన్నిహిత్య అనుబంధాన్ని, ఆయన వ్రాసిన నాటకాలు, ప్రదర్శనల గురించి సవివరపరిచారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన ఆయన జీవితాన్ని సార్థం చేసుకున్న ధన్యజీవి అని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ఫిలిం డెవపల్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ తొలిమాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు శతజయంతిని పురస్కరించుకొని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో రెండురోజులపాటు జరుగుతున్న నాటకోత్సవాల రెండవరోజు బుధవారం రాత్రి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హెచ్.జె.దొర, ఎస్.ఉత్తమ్ పద్మావతి, సమాఖ్య అధ్యక్షుడు రామచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి సాధుశ్యాం ప్రసాద్ తదితర కార్యవర్గ సభ్యులతో కలిసి కె.లక్ష్మీనరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి జ్యోతిప్రకాసనంచేసి ప్రసంగించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో శ్రీ కళానికేతన్, హైదరాబాద్ వారి సమర్పణలో కె.ఎల్.నరసింహారావు రచన, డా. వెంకట్ గోవాడ దర్శకత్వంలో రూపొందిన స్వార్థం నాటిక అద్భుతం ప్రదర్శింపబడి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుని అభినందలు అందుకుంది.

## వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించడం మంచి సంప్రదాయం

**-తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**



ఎం.కోదండరెడ్డి ఏటుకూరి కృష్ణమూర్తిలకు పురస్కారాలు ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త:**

జాతిపిత మహాత్మగాంధీ ఆశయాలను కొన్ని రాజకీయ పార్టీలు నేడు మరిచిపోయాయని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ, ఆర్ఆర్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సీల్‌వెల్ సినీ సుస్వరాలు-64' కార్యక్రమంలో భాగంగా 'సీల్‌వెల్ శృతిలయ జాతిపిత మహాత్మగాంధీ స్ఫూర్తి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేతలు బండారు సుబ్బారావు, డాక్టర్ బొక్కా భీమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆమని నిర్వహణలో జరిగింది. ముఖ్యఅతిథులుగా తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్త హాజరై ఈ పురస్కారాలను ఎం.కోదండరెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం అధ్యక్షుడు ఏటుకూరి కృష్ణమూర్తిలకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలలో తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త**

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ సరఫరా మూడవ దశలోని 2375ఎంఎం దయా ఓఎంఎస్ పంపింగ్ మెయిన్‌కి లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీనికి అరికట్టడానికి మతరమత్తులు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 6గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటల వరకు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. శాస్త్రీపురం, బండ్లగూడ, బోజగుట్ట, షేక్‌పేట, ఆళ్లబండ, జుబ్లిహిల్స్, ఫిల్మ్‌నగర్, ప్రశాసన్‌నగర్, తట్టిఖానా, లాలాపేట, సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి రిజర్వాయర్లు, సైనిక్‌పురి, మౌలాలి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, కావూరి హిల్స్, కైలాసిగిరి, దేవంద్రనగర్, మధుబన్, దుర్గానర్, బుద్వేల్, సులేమాన్‌నగర్, గొల్డెన్ హైట్, కిస్మత్‌పురం, బొడుప్పల్, మల్లిఖార్జునగర్, మాణిక్‌చంద్, చెంగిచర్ల, భరత్‌నగర్, ఫిర్జాదిగూడ, పెద్దఅంబర్‌పేట, ధర్మసాయి శంషాబాద్‌లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**జీడిమెట్ల, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

నేడు పలు అభివృద్ధి పనుల కారణంగా ఉదయం 10 గంటల నుండి 11.30 గంటల వరకు జీడిమెట్ల సబ్‌స్టేషన్ నుండి ఏపిఐఐసి ఫీడర్‌లో టిఎస్ఐఐసి కాలనీ, గంపలబస్తీ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 గంటల నుండి 4.30 గంటల వరకు గంపలబస్తీ పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని జీడిమెట్ల ఏఈ పి.ప్రసూన ఓ ప్రకటనలో తెలిపారు.

### నిజాంపేట్ పరిధిలో..

**నిజాంపేట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** నేడు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు 33/11 కేవీ వికాస్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ వోల్వో ఫీడర్‌లోని కౌసల్య కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీ, కావ్య కాలనీ, సంత్ర కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్రజలను గాయపరిచిన కుక్కలను పట్టించిన శాంతి సాయిజన్ శేఖర్



కుక్కలను పిట్టిస్తున్న సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలో ఒకే కుక్క ఐదుగురిని గాయపరిచడంతో వెంటనే స్పందించిన బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ సిబ్బంది ద్వార కుక్కలను పట్టుకొని అక్కడి నుంచి పంపించారు. సుమారు ఆరు కుక్కలను పట్టుకున్నారు. అనంతరం గాయపడిన వ్యక్తి ఇంటికి వెళ్లి పరమార్శించి తగిన ధైర్యాన్ని ఇచ్చారు.

## మేరు కులస్తులను ఒకే కులంగా పరిగణించాలి



రాష్ట్ర బీసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ మేరు సంఘం రాష్ట్ర అడ్‌హాక్ కమిటి ప్రతినిధులు

**యాకుత్‌పుర,అక్టోబరు 23 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణనలో చేతివృత్తి పని చేసుకునే మేరు కులస్తులను ఒకే కులంగా పరిగణించాలని కోరుతూ రాష్ట్ర బీసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,కమిటీ సభ్యులు రాపోలు జయ ప్రకాష్,తిరుమలగిరి సురేందర్‌లకు తెలంగాణ మేరు సంఘం రాష్ట్ర అడ్‌హాక్ కమిటి కన్వీనర్ అడపా వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు వినతి పత్రం అంద జేసింది.ఈ కార్యక్రమంలో మేరు సంఘం ట్రస్ట్ చైర్మన్ పి.నర్సింగరావు,రాష్ట్ర నాయకులు ఎస్.బి.సంగే వార్,తీకొండ నర్సింగరావు,కీర్తి రాజ్ గోపాల్,కె.వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో వైభవంగా దీపావళి మహోత్సవాలు



సమావేశంలో పాల్గొన్న చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం ట్రస్టీ సూర్యప్రకాష్

**చార్మినార్,అక్టోబరు 23 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అత్యంత వైభవంగా దీపావళి మహోత్సవాలను నిర్వహించనున్నామని మందిరం ట్రస్టీ సూర్య ప్రకాష్ వెల్లడించారు.దీపావళీ సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండ ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ చార్మినార్ డిఈకి మందిరం తరుపున వినతి పత్రం అందజేశారు.దీపావళీ మహోత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ అన్ని ఏర్పాట్లు చేస్తామని చార్మినార్ డిఈ శ్రీధర్ తెలిపారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అక్బర్,ఫలక్‌నుమా సిబిడి ఎడిఈ ఠాకూర్ రాజేందర్ సింగ్,మొగల్‌పుర ఎఈ రాజు,భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి పారసాని వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## నేటి నుంచి హైటెక్స్‌లో ఫార్మా ఇండియా ఎక్స్‌పో

**హైదరాబాద్, అక్టోబరు 23,ప్రభాతవార్త:**

అక్టోబరు 24నుంచి 26 వరకు మూడురోజులపాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫార్మా ఇండియా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుంద్ర కుమారస్వామి, డా.వినయ్ సరికొండ, డా.మెయినుద్దీన్, డా.శ్రీధర్‌రెడ్డిలతో కలిసి కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించారు. ఈసంరద్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రముఖ ఫార్మా కంపెనీలన్నింటి ఒకే చోట తీసుకువచ్చేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఫార్మారంగంలో ప్రస్తుత కాలంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, సరికొత్త ఆవిష్కరణలు, ఉద్యోగ అవకాశ్యాలు, హెల్త్ కేర్ ఇండస్ట్రీ తదితర అంశాలపై ఈసదస్సులో చర్చిచడం జరుగుతుందన్నారు. ఈఎగ్జిబిషన్‌లో సుమారు 240 స్టాల్స్ , 500మంది డెలిగేట్స్, 15వేలకుపైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు.

## సంగీత, సాహిత్య సమ్మేళనాలతో మానసిక ఉల్లాసం



గాయకుడు చంద్రతేజ, వ్యాఖ్యాత బుర్రామోహనకృష్ణలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త:** త్యాగరాయ గానసభ సౌజన్యంతో, ఆరాధన కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సినీసంగీత విభావరి' కార్యక్రమం మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ఆవరణలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో నిర్వాహకులు లోకం కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హెలెన్‌కెల్లర్ సంస్థ అధినేత ఉమర్‌ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాటి సినీపాటలు సంగీత, సాహిత్య సమ్మేళనాలు ఆస్వాధించడం ద్వారా మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు చంద్రతేజ, వ్యాఖ్యాత బుర్రామోహనకృష్ణలను ఈ సందర్భంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో యువకళావాహిని సంస్థ అధినేత లంక లక్ష్మీనారాయణ, కథక్‌నాట్యగురువు పండిట్ అంజుబాబు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా సినీసంగీత విభావరిలో గాయనీ గాయకులు కె.వి.రావు, కళ్యాణి, అనూష, వెంకి, శ్రీకాంత్ తదితరులు అద్భుతంగా గానం చేయగా కథక్ నృత్యప్రదర్శనను లక్ష్మీవైష్ణవి అద్భుతంగా నిర్వహించారు.

## వేదపండితులకు ఘనసత్కారం

**నాంపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతిలో వేదపండితులను సత్కరించుకోవడం గొప్ప సంప్రదాయమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య సంస్థ సత్కళా భారతి 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 26 శనివారం రాత్రి 6గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగే వేడుకల్లో శ్రీ అభినవోద్ధండ విద్యాశంకర భారతీస్వామివారి దివ్య ఆశీస్సులతో ముఖ్యఅతిథి విచ్చేయనున్న ఐఎఎస్ విశ్రాంత అధికారి డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వాధ్యక్షుడు కోలేటి దామోదర్‌గుప్తా, ఆర్ఎస్ బ్రదర్స్ ఎస్.రాజమౌళి, పి.వెంకటేశ్వర్లు, సత్కళాభారతి సత్యనారాయణ తదితరులతో కలిసి వందమంది వేదపండితులకు ఘనసత్కారం చేయనున్నట్లు ఆయన విశదీకరించారు. ఈ సందర్భంగా పరమపూజ్య పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్ధండ విద్యాశంకర భారతీస్వామివారి వేదాశీర్వచనమ్ ఉంటుందని, అధికసంఖ్యలో ఔత్సాహిక ప్రేక్షకులు, ఆధ్యాత్మికవేత్తలు విచ్చేసి కార్యక్రమాన్ని ఆస్వాదించి విజయవంతం చేయాలని డా. కె.వి.రమణాచారి కోరారు.

## ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

**నేరేడ్‌మెట్, అక్టోబర్23 ప్రభాతవార్త:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలమైన సర్వే నెంబర్ 278 వాజ్‌పేయి నగర్‌లో నిరుపయోగంగా ఉన్న రెండు ఎకరాల పాత కోర్టు స్థలంలో మల్కాజిగిరి ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత 7 సంవత్సరాలుగా స్థలం ఖాళీగా ఉండడంతో అందులో మందుబాబులకు మంచి అడ్డాగా మారిందన్నారు. ఈ ఖాళీ స్థలంలో మల్కాజిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. గత 15 సంవత్సరాలుగా వాయుపురిలోని ఓ అద్దె భవనంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఖాళీ స్థలంలో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు (ఎమ్మార్వో, పోలీస్టేషన్, సబ్ రిజిస్టర్ కార్యాలయం) ఉంటాయని వారు ఆశాభావం వ్యక్తం చేసారు.

## రూ. 25లక్షలతో సిసి రోడ్డు పనుల ప్రారంభం..



సీసీ రోడ్డు పనులను మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌తో కలసి ప్రారంభిస్తున్న మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్..

**జవహర్‌నగర్, అక్టోబర్23 ప్రభాతవార్త:** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ భాగ్యనగర్, జై రామ్ నగర్ కాలనీలో 25లక్షలతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్పొరేషన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కుతాడి సాయికుమార్, కమీషనర్ ప్రవీణ్ రెడ్డి, జవహర్ నగర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, సతీష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదుకు విశేష స్పందన : కార్పొరేటర్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు బిజెపి సభ్యత్వాన్ని తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీలలో బిజెపి కరపత్రాలను పంపిణీ చేసిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి నేతృత్వంలోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం మన దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుపుతుందన్నారు. బిజెపి సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి ముఖ్యంగా యువత నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి : కార్పొరేటర్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** సభ్యత్వ నమోదు పార్టీని మరింత బలోపేతం చేయడానికి తోడ్పడుతుందని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. వినయ్ నగర్ కాలనీలో నిర్వహించిన బిజెపి సభ్యత్వ నమోదు సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు బిజెపి సభ్యత్వ నమోదును విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదులో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, రాష్ట్ర కార్యదర్శి దశరథ లక్ష్మి, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు మంజుల రెడ్డి పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు : ఎమ్మెల్యే బలాల



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట అక్టోబరు23,ప్రభాతవార్త :** చంచల్ గూడ డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు.ప్రజావాణి నోడల్ కమిషనర్ దివ్య దేవరాజన్,ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల చంచల్ గూడ డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలను బలాల సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల గృహ సముదాయంలో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా అధికారులతో పలు అంశాల గురించి చర్చించారు.అనంతరం ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ......గృహ సముదాయంలోని ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేమంత్,సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న,డిప్యూటీ కమిషనర్ జయంత్ ,చావుని డివిజన్ కార్పొరేటర్ సలాంషాహిద్ సైదాబాద్ మండలం తసిల్దార్ జయశ్రీ ,అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కార్పొరేటర్ బన్నాల గీత దంపతులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ దంపతులు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో మహాభాగ్యమని, శ్రీవారి దయతో చిలుకానగర్ డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులు మాజీ సిఎం కెసిఆర్, కెటిఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## మూసీ పరివాహక ప్రాంత పేదల జోలికి వస్తే ఖబడ్దార్ : ఎంపి ఈటల



మూసీ నిర్వాసితులతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్, డా.శిల్పారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదల ఇళ్ల జోలికి వస్తే సిఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, పలువురు పార్టీ నేతలతో కలిసి రామంతాపూర్ మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజలు మాజీ సిఎం కెసిఆర్‌తో విసిగిపోయి ప్రభుత్వాన్ని కూలగొట్టి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రేవంత్‌రెడ్డి పదవిలోకి వచ్చిన తర్వాత మూసీ సమీపంలో ఉండే పేదలను ఇళ్లను కూల్చివేసేందుకు సిద్దం అవుతున్నారని పేర్కొన్నారు. మూసీలో కొబ్బరి నీరు పారిస్తా అన్నారని, నేడు డిపిఆర్ లేదని, ప్రణాళిక రూపొందించలేదని సిఎం చెబుతున్నారని తెలిపారు. శని, ఆదివారం వస్తే పేదలు భయభ్రాంతులకు గురిఅవుతున్నారని, ప్రజల శవాల మీద సిఎం రేవంత్‌రెడ్డి ప్రసాద్ ఐమాక్స్, జలవిహార్ లాంటి భవనాలు కట్టాలని చూస్తున్నారని విమర్శించారు. దీనిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బిజెపి మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు అండగా ఉంటుందని, రెండు నెలలుగా మూసీ పరివాహక ప్రాంతాల్లో తిరుగుతున్నామని తెలిపారు. బిజెపి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని ఇందిరాపార్కు వద్ద భారీ ఎత్తున ధర్నా చేస్తామని తెలిపారు. పేదల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేయవద్దని, వారి జోలికి వస్తే సహించేది లేదన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో మూసీ నిర్వాసితులతో బేటి అయి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, చింతోజు శ్రీనివాసాచారి, గడ్డం సాయికిరణ్, గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణ, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, గోనె అంజయ్య, శ్రీకాంత్, ఇలిటం నరసింహారెడ్డి, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాము యాదవ్, వర్కల రాజేందర్‌గౌడ్, నారాయణదాసు, తిరుపతయ్య, చెల్లోజు ఎల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జునస్వామి ఆలయ కమిటి ప్రమాణ స్వీకారోత్సవం



రామంతాపూర్ మల్లికార్జునస్వామి ఆలయ కమిటి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం కమిటి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్‌గా నామ్ రాజిరెడ్డి, సభ్యులుగా మేడిపల్లి విశాల్‌రెడ్డి, ఇరుకుల సతీష్, ముత్యాల జంగయ్య, మెంగ శోభ, మెగిలి లింగం, బొడ్డు బాలయ్య, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా మోత్కూరి శేఖర్‌బాబు నియమితులైయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, పార్టీ కోసం పనిచేసిన వారికి తగు గుర్తింపు ఇస్తున్నామని తెలిపారు. రామంతాపూర్ ప్రజలకు తన సేవలు ఎప్పటికి అందిస్తానని, ఆలయం అభివృద్దికి కొత్త కమిటి నేతలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, తౌఫిక్, ఎండి.రఫీక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఆవులగడ్డ శ్రీనివాస్‌యాదవ్, కంది శ్రవణ్‌రెడ్డి, పలువురు పార్టీల నేతలు,పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ బృందావన్ కాలనీలో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని, వర్షాకాలం సమయంలో రోడ్డు పై ఎక్కడ నీళ్ల నిల్వ ఉండకుండా సరైనటువంటి లెవెల్స్ చూసుకోవాలని డివిజన్ ఏఈ మాధునాయక్ ని కోరారు. అనంతరం బృందావన్‌కాలనీ నుంచి మూసి నది వరకు కోటి రూ.1.30 కోట్లతో నిర్మించిన బాక్స్ డ్రైనేజ్ నాళాను, న్యూ మారుతినగర్ రోడ్‌నెంబర్ 10లో సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నెలరోజుల్లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం : కౌన్సిలర్



డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో కౌన్సిలర్, కాలనీప్రతినిధులు

**హయత్‌నగర్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** నెలరోజుల్లో పైప్‌లైన్ పనులను పూర్తిచేసి 9వ వార్డుపరిధిలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు. వార్డుపరిధి లక్ష్మారెడ్డిపాలెంలోని శ్రీనగర్ కాలనీలో 16లక్షల రూపాయల వ్యయంతో పబ్బతి వెంకట్‌రెడ్డి ఇంటినుంచి జాతీయ రహదారి వరకు చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ... లుంబినీహిల్స్, సూర్యవంశీకాలనీ, శ్రీనగర్ కాలనీ, సాయి కుటీర్‌లో ప్రధాన దారుల గుండ పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తున్నామని జాతీయ రహదారి పక్కనుంచి జేసీబీ షోరూం వరకు పైప్‌లైన్ పనులు పూర్తికాగానే ట్రంక్‌లైన్‌కు కలిపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వార్డుపరిధిలోని అన్ని కాలనీల్లో డ్రైనేజీ, తాగునీరుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, తరువాత ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జంగారెడ్డి, వీర్రాజు, శశిధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, మాధవి, సునీత, స్వామతి, లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

## ఫీజురీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలి



హయత్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**హయత్‌నగర్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంటు, ఉపకార వేతనాల విడుదలలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఏఐవైఎఫ్ఐ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫీజు రీయంబర్సుమెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, నేడు అదేప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఏటా రాష్ట్రంలో 12.50 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాలు, బోధనా ఫీజులు కలిపి 7700 కోట్లకు పైగా బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల కోసం అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని పీజురీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ఐ నాయకులు వెంకటేష్, శివ, వీరేష్, సంజయ్, నాగరాజు, గణేష్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## భద్రత విషయంలో పోలీసులకు సహకారం : పున్న



ఇన్స్పెక్టర్ను సన్మానిస్తున్న పున్న గణేష్ తదితరులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** భద్రతా పరమైన విషయంలో తాము పోలీసులకు సహాయ సహకారాలు అందిస్తామని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా భాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును బుధవారం కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా పున్న గణేష్ నేత మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా, కాలనీలో గస్తీని పెంచి నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూధన్‌రావ్, గట్ల రవీంద్ర, ఎన్ఎస్‌యుఐ శివ, ఖిల్లా మైసమ్మ మాజీ చైర్మన్ పగిల్ల భూపాల్‌రెడ్డి, నాయకులు దుర్గాప్రసాద్, జెల్లా జగన్నాథం, బొడ్డుపల్లి మహేందర్, యల్లన్న, కృష్ణారెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, పోట్లబతిని నగేష్, దొర్నాల చంద్రమౌళి, సందీప్, సంపత్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి దేవాలయంలో ఎంపీ ఈటెల ప్రత్యేక పూజలు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌రావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆలయాలలో అష్టలక్ష్మి ఆలయం ముందు వరసలో ఉందన్నారు. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతనకల్గి ఉండాలన్నారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా, కొప్పుల నర్సింహారెడ్డి, ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్త, చైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, ఆలయ కోశాధికారి అయిత అంజయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

## గతప్రభుత్వంలో అధికారులు ప్రజా సమస్యలను విస్మరించారు

**హయత్‌నగర్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** గతప్రభుత్వ హయాంలో అధికారులు టీఆర్ఎస్‌కు తొత్తులుగా వ్యవహరించి స్థానిక సమస్యలను పట్టించుకునే వారు కారని... ప్రస్తుతం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను తెలుసుకుని నిధులను కేటాయించడం శుభపరిణామమని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి హయత్‌నగర్ ప్రాంతంలోని పవనగిరి కాలనీ ఫేజ్-2లో 21.50 లక్షలు, ఎల్లారెడ్డి కాలనీలో 38 లక్షల ట్రంక్‌లైన్, లక్ష్మీనగర్ కాలనీలో 16 లక్షల సీసీరోడ్డు, కొలనుశివారెడ్డి కాలనీలో భూగర్భడ్రైనేజీ, ఆగమయ్యనగర్‌కాలనీలో 18 లక్షల సీసీరోడ్డు పనులను ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇక్కడి ప్రజలు కడుదున్న పన్నుల సొమ్మును దారి మళ్లించకుండా స్థానికంగా సమస్యల పరిష్కారానికి వెచ్చిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవపాటిల్‌కు అభినందనలు తెలపారు. జీహెచ్‌ఎంసీ నుంచి సరైన నిధులు లేకపోవడంతో కొంతమేర పనులు ఆలస్యం అవుతున్నాయని,... మిగిలిన పనులను కూడా సాధ్యమయినంత త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎండి శైలజ



ట్రాన్స్ జెండర్‌ల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

**మలక్‌పేట అక్టోబరు23,ప్రభాతవార్త :** మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శైలజ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఈనెల 24వ తేది వరకు ఆధార్ నమోదు కేంద్రం కొనసాగుతుందని తెలిపారు.సహకార సంస్థ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రోగ్రాం మేనేజర్ జయంతి,కో ఆర్డినేటర్ ప్రతీలు ప్రారంభించారు.

## అంగన్‌వాడీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



బిజార్ నగర్‌లో అంగన్‌వాడి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్ కుమార్

**మల్కాజిగిరి అక్టోబరు23,ప్రభాతవార్త :** అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన నాణ్యమైన భోజనం అందించాలని కార్పొరేటర్ అన్నారు.బుధవారం బీజాంనగర్‌లోని అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ....నిత్యావసర సరుకులతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రేమ్ కుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సంధ్యారాణి పద్మజ మంజుల బాబు కిషోర్,సలీం అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకరిస్తాం

### -కోసికే ఐలయ్య,రామావత్ కళ్యాణ్ నాయక్



**తుర్కయంజాల్ అక్టోబరు23,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22,23వ వార్డు కమ్మగూడ పరిధిలో లక్ష్మినగర్ కాలనీకి వెళ్లే మెయిన్ రోడ్డు 25 ఫీట్లు ఉన్నందుకు వివిధ కాలనీలోకి స్కూల్ బస్సులు, లారీలు,ఆటోలు,బైకులు,పాదాచార్యులు ,వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు రోడ్డు వెడల్పు తక్కువ ఉండడం వలన కాలనీలోకి వెళ్లే కాలనీవాసులు 15 సంవత్సరాల నుండి చాలా ఇబ్బంది పడుతుంటే అక్కడ స్థానిక కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు కోసికే ఐలయ్య,రామవత్ కళ్యాణ్ నాయక్,చూసి వెంటనే ఎమ్మెల్యేకు ,మున్సిపాలిటీ చైర్‌పర్సన్,అధికారులకు తెలియజేసి వెంటనే రోడ్డు వెడల్పు వేయించడం జరిగింది.లక్ష్మి నగర్,కాలనీవాసులు ఎంతో సంతోషంతో కౌన్సిలర్లకు,ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నక్క శేఖర్ యాదవ్,రామావత్ లాలు నాయక్,దస్రు నాయక్,వేముల శంకర్,పాండు నాయక్,సభావాత్ లక్ష్మణ్ నాయక్,చందు నాయక్, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలి : పొల్కం శ్రీనివాస్



జలమండలి ఎండి అశోక్ రెడ్డితో సమావేశమైన పొల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్‌పేట అక్టోబరు23,ప్రభాతవార్త :** జలమండలి కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జెఎసి మీడియా ఇన్‌చార్జి పొల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు.పొల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్టర్లు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డితో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంట్రాక్టర్లకు తక్షణమే పాత బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.పాత బకాయిలను చెల్లించకపోతే ప్రిన్సిపల్ సెక్రటేరీ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని తెలియజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి చిన్న కాంట్రాక్టర్లకు జలమండలిలో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాజుద్దీన్,మహమ్మద్ ఇమ్రాన్, విక్రమ్, ప్రవీణ్ కుమార్,యాదగిరి,జనార్ధన్ పాల్గొన్నారు.

## ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి హెచ్ఆర్‌డిసిఎల్ అధికారుల సర్వే

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్ ఆర్‌సిఐ క్రాస్ రోడ్స్ నుండి పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డుకు కలిసే రహదారి వరకు కొత్తగా ఆరు లైన్ల రోడ్డు ఏర్పాటుకు బుధవారం హెచ్ఆర్‌డిసిఎల్ అధికారులు సర్వే చేశారు. స్థానిక కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డితో కలిసి హెచ్ఆర్‌డిసిఎల్ ఇఇ విజయ్‌కుమార్, డిఇఇ నర్సింహరాజు తదితరులు రోడ్డును పరిశీలించారు. ఈ మేరకు రోడ్డు హద్దులను కూడా వారు పరిశీలించారు. అంతకు ముందు బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్‌తో అధికారులు సమావేశమై రోడ్డు గురించి చర్చించారు. అయితే రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని మేయర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ ఎఇఇ వినీల్‌గౌడ్, గంగుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ ధర్మయుద్ధ మహాసభ విజయవంతం చేయండి

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్‌లో ఎంఆర్‌పిఎస్ నేత తోకట నరేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాలలో వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయడం లేదన్నారు. ఈనెల 29న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు నాగులపల్లి కేశవ్, డా.అశోక్, మస్క రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీటి సమస్య తీర్చాలని కెఎల్‌ఆర్‌కు వినతి



కెఎల్‌ఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సామిడి గోపాల్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, టిపిసిసి ప్రచారం కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. ఈ మేరకు గోపాల్‌రెడ్డి బుధవారం తుక్కుగూడలోని కెఎల్‌ఆర్ క్యాంపు కార్యాలయానికి పలువురు నాయకులు, కార్యకర్తలు, డబుల్ బెడ్‌రూంవాసులతో కిచ్చెన్నను కలిసి తాగు నీటి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు స్పందించిన కెఎల్‌ఆర్ మాట్లాడుతూ సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్యను తీరుస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, స్వామి నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ సిపిఎన్ఆర్ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిపిఎన్ఆర్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లోని సిపిఎన్ఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సిసి రోడ్డుకు సంబంధించిన పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండారి మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎఇఇ వినీల్‌గౌడ్, బడంగ్‌పేట్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, అప్పారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారునిగా కిషన్‌గుప్త

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారునిగా మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన వనపర్తి కిషన్‌గుప్తా ఎన్నికయ్యారు. ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను గౌరవ సలహాదారునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భగా కిషన్‌గుప్త మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగ అభివృద్ధికి కృషి చేస్తూ ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి పాటుపడుతానని అన్నారు. తనను రాష్ట్ర కార్యవర్గంలో గౌరవ సలహాదారునిగా నియమించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వేకంటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు



ఎమ్మెల్యే బిఎల్‌ఆర్‌పై అక్షితలు చల్లుతున్న అర్చకులు

**నాచారం, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** నాచారంలోని శ్రీవేకంటేశ్వర స్వామి వారి షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వర చార్యులు వారి బృందం పర్యవేక్షణలో శ్రీనివాస కళ్యాణం కన్నుల పండువగా సాగుతున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి డా. దుర్గాప్రసాద్, అధ్యక్షుడు రామచంద్రరావు, కార్యదర్శి ఆర్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ రాజ్, గోపాల్ రెడ్డి, శేషారెడ్డి, శేషారెడ్డి, భీష్మారి, వెంకటరెడ్డి, జనార్ధన్ రావు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలోని స్నేహపురి, వీఎస్‌టీ కాలనీ,రాఘవేంద్రనగర్ రైతు బజార్ సమీపం తదితర ప్రాంతాల్లోగల పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిదంగా స్నేహపురి కాలనీ, హెచ్ఎంటీనగర్ పార్కులల్లో పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరారు. అందుకు జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ చెప్పారు.



జల్‌పల్లి మున్సిపాలిటీలోని నబీల్ కాలనీలో ఎస్ఎన్‌డిపి నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రహమత్‌బేగ్: చిత్రంలో మహేశ్వరం నియోజకవర్గ ఎంఐఎం పార్టీ ఇంఛార్జి అహ్మద్ సాది, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, స్థానిక కౌన్సిలర్ అహ్మద్ కసాది, ఎంఐఎం నాయకులు ఉన్నారు. (సరూర్‌నగర్, ప్రభాతవార్త)